క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్ సీపీ అధినేతతో దాసి సుందర్‌పాల్

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన ఏలూరు జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దాసి సుందర్ పాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయాల గురించి మాట్లాడడారని తెలిపారు. అదే విధంగా పార్టీ బలోపేతానికి, పటిష్టకు కృషి చేయాలని, పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించినట్లు ఆయన తెలిపారు.

ఆర్ఎస్‌కేలకు శిక్షణ

బుట్టాయగూడెం: స్థానిక రైతు శిక్షణ కేంద్రం వద్ద ఆర్ఎస్‌కె ఇన్‌చార్జిలకు శుక్రవారం పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో అన్ని గ్రామాలకు సంబంధించిన ప్లాన్స్, ప్రయోగ పద్ధతిని ఏఓ ప్రియాంక వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతలపూడి: ఈ నెల 27వ తేదీ శంకుచక్రపురం సబ్ స్టేషన్ పరిధిలో సత్య సాయి, ప్రగడవరం, తిమ్మిరెడ్డిపల్లి ఫీడర్లకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. కావున ఆయా ఫీడర్ల పరిధిలో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



విద్యుత్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎస్సై

టి.నరసాపురం: ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బందికి ఎస్సై ఎం.జయబాబు సూచించారు. టి.నరసాపురం పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జయబాబు మాట్లాడూ ప్రాణం విలువైందని, ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రైతులు గెలలు కోసే సమయంలో అవసరం చేరకు లైన్ క్లియరెన్స్‌లను సిబ్బంది రైతుల కోరిక మేరకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ బాజీ, లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, లైన్‌మెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాయన్ సేవలు భేష్

ద్వారకాతిరుమల: మండల ప్రజలకు డిప్యూటీ ఎంపీడీవోగా ఏవీ సుబ్బరాయన్ అందించిన సేవలు భేష్.. అని ఎంపీపీ బొండాడ మోహిని అన్నారు. ఇటీవల ఆయన డీఎల్‌పీఓగా పదోన్నతి పొంది జంగారెడ్డిగూడెం బదిలీ అయిన సందర్భంగా ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో ఎంపీపీ మోహిని, ఎంపీడీవో ప్రకాష్, పలువురు పంచాయితీ కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి సుబ్బరాయన్‌కు దుశ్శాలువాను కప్పి, తిరుమల శ్రీవారి చిత్రపటాన్ని అందించి ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు బొండాడ వెంకన్నబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, చిలుకూరి చంద్రం, పొనమాల ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవోస్ ఎన్నికలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం తాలూకా యూనిట్ ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ ఎన్నికలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల అబ్జర్వర్ ఎం.ఫణి కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలకు జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు హాజరై ఎన్నికైన సభ్యులు వివరాలు వెల్లడించారు. జంగారెడ్డిగూడెం తాలూకా యూనిట్ ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షులుగా వై.నరేష్‌బాబు, కార్యదర్శిగా ఎ.హనుమంతు, కోశాధికారిగా దాగం వేణుగోపాలచారి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా బి.శిరీష, ఎస్‌కే ఇబ్రహీం, ఎ.కృష్ణమోహన్, జాయింట్ సెక్రెటరీగా ఎం.నిరీక్షణ కుమారి, కె.పద్మావతి, ఎన్.వీరభద్రరావు, జాయింట్ సెక్రటరీ ఉమెన్‌గా పి.విజయలక్ష్మి ఎన్నికైనట్లు తెలిపారు.

మహాసభల జయప్రదానికి పిలుపు

కుక్కునూరు: సీఐటీయూ అఖిల భారత మహాసభలు 2025 డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

భక్తులపాలిట కల్పవల్లి కుంకుళ్లమ్మ

- శ్రీవారికి చెల్లిగా, క్షేత్ర దేవతగా అమ్మవారు
- దసరా ఉత్సవాల్లో కుంకుళ్లమ్మ దీక్షను చేపడుతున్న భక్తులు
- నిత్య పూజలతో కళకళలాడుతున్న ఆలయం



క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ ఆలయం



క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ



కుంకుళ్లమ్మ దీక్షాధారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి సోదరిగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, భక్తుల పాలిట కొంగు బంగారంగా, క్షేత్ర దేవతగా శ్రీకుంకుళ్లమ్మ విరాజిల్లుతున్నారు. అమ్మవారి ఆలయంలో ప్రస్తుతం దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వీటిని పురస్కరించుకుని ద్వారకాతిరుమలతో పాటు తిమ్మాపురం, గొల్లగూడెం, ఆంజనేయనగరం, కొయ్యలగూడెం, దేవరపల్లి, ఉయ్యూరు తదితర ప్రాంతాలకు చెందిన సుమారు వంద మందికి పైగా భక్తులు కుంకుళ్లమ్మ దీక్షను చేపట్టారు. కొందరు భవానీ మాలతో కలిపి, ఈ దీక్షను స్వీకరించారు. ఇప్పటికే 41, 21, 11 రోజుల దీక్షను భక్తులు చేపట్టారు. ఎక్కువ రోజులు దీక్ష చేయలేని చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు 3 రోజుల దీక్షను స్వీకరించేందుకు సిద్ధమవుతున్నారు.

21 ఏళ్లుగా దీక్షలు

కుంకుళ్లమ్మ దీక్షను 2004లో అప్పటి ఆలయ ఈఓ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా దసరా ఉత్సవాల సమయంలో భక్తులు ఈ దీక్షను స్వీకరిస్తున్నారు. సకల ఉపద్రవాలను, ప్రమాదాలను, అనుకోని అవాంతరాలను నివారించే వరదాయినిగా కుంకుళ్లమ్మను దీక్షాదారులు ఆరాధిస్తున్నారు.

అమ్మవారికి నిత్య పూజలు

దీక్ష చేపట్టిన భక్తులు ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారిని దర్శిస్తున్నారు. ముందుగా వారు ఆలయం వెనుక భాగాన కుంకుళ్లమ్మ ఆవిష్కారమైన కుంకుడు చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్నారు. ఎందుకంటే భక్తులు ఈ చెట్టును ప్రత్యక్ష దేవతగా, అమ్మవారి మూలస్థానంగా, పుట్టినిల్లుగా ఆరాధిస్తారు.

యాత్రలో కష్ట నష్టాలు ఉండవు

ద్వారకాతిరుమలకు కిలో మీటరు దూరంలో ఉన్న ఈ కుంకుళ్లమ్మ క్షేత్రానికి వచ్చే భక్తులకు యాత్రలో కష్ట నష్టాలు కలగనివ్వరని భక్తుల నమ్మకం. అందుకే శ్రీవారిని దర్శించిన అనంతరం భక్తులు తిరుగు ప్రయాణంలో తప్పనిసరిగా ఈ అమ్మవారిని దర్శిస్తారు. అలా దర్శిస్తేనే యాత్ర పరిపూర్ణం అవుతుందని పండితులు చెబుతున్నారు.

అమ్మ అనుగ్రహానికి వ్రతం



కుంకుడు చెట్టు కింద వెలసిన కుంకుళ్లమ్మ దివ్య స్వరూపిణి. ఈ అమ్మవారిని రేణుకాదేవిగా, శుభంకరిగా, క్షేమంకరిగా పిలుస్తారు. కుంకుళ్లమ్మ అనుగ్రహాన్ని పొందడానికి భక్తులు ప్రతి ఏటా దసరా ఉత్సవాల్లో దీక్షను స్వీకరిస్తున్నారు. ఈ ఆలయంలో చైత్ర మాసంలో వసంత నవరాత్రులు, ఆశ్వయుజ మాసంలో శరన్నవరాత్రులు, శ్రావణ మాసంలో గాజుల అలంకరణ, సామూహిక వరలక్ష్మీ వ్రతాలను శ్రీవారి దేవస్థానం వైభవంగా నిర్వహిస్తోంది.

–భైరవస్వామి, ప్రధానార్చకులు, కుంకుళ్లమ్మ ఆలయం

భవానీ దీక్షతో పాటు



25 ఏళ్ల నుంచి భవానీ దీక్ష చేపడుతున్నాను. కుంకుళ్లమ్మ అమ్మవారిపై ఉన్న నమ్మకంతో గతేడాది నుంచి ఈ దీక్షను కూడా స్వీకరిస్తున్నాను. అమ్మవారి సేవలో ఉండటం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుంది. నమ్మకంతో, నిష్ఠగా కొలిచే భక్తులకు అమ్మవారి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి.

– మారిశెట్టి కుమారి, దీక్షాధారిణి, ద్వారకాతిరుమల

కోర్కెలు తీరుతాయని నమ్మకం



కుంకుళ్లమ్మను మనస్ఫూర్తిగా ఏ కోరిక కోరినా తీరుతుంది. అందుకే అమ్మవారిని దర్శించే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గత 20 ఏళ్లుగా నేను అమ్మవారి దీక్ష చేపడుతున్నాను. ప్రతి ఏటా దసరా ఉత్సవాల్లో అమ్మవారి దీక్షను ద్వారకాతిరుమల వాసులతో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు స్వీకరిస్తున్నారు.

– పోలేపల్లి శ్రీను, దీక్షాధారుడు, ద్వారకాతిరుమల

సీఆర్‌పీలకు శిక్షణ



సీఆర్‌పీలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: సంపద తయారీ కేంద్రం వద్ద శుక్రవారం బుట్టాయగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం మండలాల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్, స్వయం సహాయ సంఘాల సభ్యులకు చెత్త నుంచి సంపద తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ ఏవీ సుబ్బరాయ్ మాట్లాడుతూ శిక్షణలను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తడి, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేసే విధంగా ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. చెత్త నుంచి కంపోస్ట్ ఎరువు తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, డీపీఆర్‌సీ డీసీ ప్రసంగరాజు, ఆర్‌పీ సూర్య, ఎఫ్‌టీసీ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి దేవప్రియుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్ నిర్వహణ

పోలవరం రూరల్: పోలవరంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హెల్త్ క్యాంప్‌కు పలువురు చికిత్స చేయించుకుని అవసరమైన మందులను తీసుకున్నారు. ఈ వైద్య శిబిరంలో రక్తదాన కేంద్రం ఏర్పాటు చేశారు. పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, పలువురు నాయకులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కూటమి ఎమ్మెల్యేల వ్యాఖ్యలపై ఖండన

జంగారెడ్డిగూడెం: అసెంబ్లీలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రిగా పని చేసిన కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, హిందూపూరం ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అసెంబ్లీ సాక్షిగా కూటమి ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే స్పీకర్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. వారి మాటలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో ఉద్యమం చేస్తామని జెట్టి హెచ్చరించారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు దారుణం



మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: అసెంబ్లీ వేదికగా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన దుద్దుకూరులో విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ దేవాలయం లాంటిదని అలాంటి అసెంబ్లీలో బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు దారుణమన్నారు. అసెంబ్లీలో ప్రజలకు ఇచ్చిన హామీలపై చర్చలు చేయకుండా ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. చంద్రబాబు వైఎస్ జగన్‌పై విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారే తప్ప ప్రజలపై ప్రేమ లేదని అన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి

కామవరపుకోట: తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి సహకరించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని జంగారెడ్డిగూడెం డీఎల్‌డీవో ఎం.రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సీఆర్‌పీల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, ద్వారకాతిరుమల మండల సీఆర్‌పీలు శిక్షణకు హాజరయ్యారు. జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో సుబ్బరాయన్, కామవరపుకోట ఎంపీడీఓ సరళ కుమారి, డీపీఆర్సీ జిల్లా కో–ఆర్డినేటర్ ప్రసంగిరాజు, రంగ నాయకమ్మ, సర్పంచ్ కె.అనూష, ఉప సర్పంచ్ రంగబాబు, పంచాయతీ కార్యదర్శి వి.రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు విసుగు చెంది లక్కవరం గ్రామానికి చెందిన సుమారు 20 మంది శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు సమక్షంలో లక్కవరం గ్రామానికి చెందిన వడ్డెర సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీకాకుళం సత్యనారాయణ, సుమారు 20 మందితో కలిసి పార్టీలో చేరారు. వీరికి జెట్టి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం సత్యనారాయణ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించి, ధైర్యాన్ని నింపారన్నారు. కార్యక్రమంలో లక్కవరం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిల్లా దుర్గారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, చిట్టిబొమ్మ శివరామకృష్ణ,



శ్రీకాకుళం సత్యనారాయణను కండువాతో పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెట్టి గురునాథరావు

చల్లా రామకృష్ణ, నిమ్మ రామకృష్ణ, జీరి పాపారావు, నంబూరి బ్రహ్మం, యంత్రపాటి శివాజీ, ఆళ్ల సత్యనారాయణ, ఎంపీపీ కొదమ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కొయ్యలగూడెం: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో రైతులు భాగస్వామ్యం కావడం హర్షణీయమని వర్జీనియా పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరెట్ పేర్కొన్నారు. శుక్రవారం అంకాలగూడెం గ్రామంలో రైతుల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛభారత్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తూనే పారిశుద్ధ్యాన్ని అమలు చేశారు. బోర్డు అధికారులతో పాటు రైతులు చెత్తని ఏరువేస్తూ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. రైతు నాయకులు గంటా రాంబాబు,ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, తోట



స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న అధికారులు

వెంకటేశ్వరరావు, ధూళిపాల బాబురావు, జి.భద్ర, టి.నాని, సర్పంచ్ కడకట్ల గడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

మానవతకు ఫ్రీజర్ అందజేత

జంగారెడ్డిగూడెం: మానవత స్వచ్ఛంద సంస్థకు దాత ఫ్రీజర్‌ను అందజేశారు. జంగారెడ్డిగూడెం బాటగంగానమ్మ లేఅవుట్ కాలనీ వద్ద మానవత కార్యవర్గ సభ్యులు మొగలనీడి శ్యామ్ రూ.65 వేల విలువైన ఫ్రీజర్‌ను మానవత అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ, సెంట్రల్ కమిటీ మెంబర్ ఏవీ రమణ మూర్తికి అందజేశారు. అలాగే ఫ్రీజర్‌ను ఉంచేందుకు షెడ్డును ఏర్పాటు చేశారు. ఈ షెడ్డును వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు ప్రారంభించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు వంశీ కుమార్ రాజా, సెంట్రల్ కమిటీ కన్వీనర్ త్రిపుర రమేష్, రీజియన్ చైర్మన్ దల్లి ఆంజనేయరెడ్డి, మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు, గద్దె సత్యనారాయణ, వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

నడకతో గుండె పదిలం

కొయ్యలగూడెం: నడకతో గుండె పదిలమని వాకర్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆరోగ్య హాస్పిటల్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహనకు ర్యాలీ నిర్వహించారు. రెండు కిలోమీటర్ల మేర నిర్వహించిన ర్యాలీలో వాకింగ్‌పై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. కొల్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజూ 30 నిమిషాలు నడవాలన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా కొయ్యలగూడెం ఆరోగ్య ఆసుపత్రి వద్ద 27వ తేదీ శనివారం మెగా గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాదేటి సత్యనారాయణ, డాక్టర్ నరహరిశెట్టి సతీష్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్‌బీజీ శేఖర్, రోటరీ క్లబ్ సభ్యులు, ఆరోగ్య ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫాసిస్టు వ్యతిరేక సదస్సు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ఈ నెల 27న ఫాసిస్టు వ్యతిరేక సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ రాష్ట్ర కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఫాసిస్టు వ్యతిరేక విధానాలను నిరశిస్తూ ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుల్లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి నంబూరి శ్రీమన్నారాయణ, అలుగు ఆనందశేఖర్ తదితరులు తమ అభిప్రాయాలు తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ భారత్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి మడకం రామన్న, నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మందలపల్లి రాజు, కామన సత్యనారాయణ, డి.వెంకన్న, సుదర్శన్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: ఫాసిజానికి వ్యతిరేకంగా చేపట్టే ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. 27వ తేదీ జంగారెడ్డిగూడెం రోటరీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న ఫాసిజం వ్యతిరేక సదస్సుకు సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం కన్నాపురం రోడ్డులోని కార్యాలయం వద్ద నిర్వహించారు. మాదేపల్లి వెంకటరత్నం, అర్జ ధర్మారావు, మడకం రామన్న, మందలపల్లి రాజు, డి.సంసోను, జి.నాగమణి, బి.బద్రి, పి.నాగమణి, పి.దుర్గా తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు కలిసి ఈ విద్యా సంవత్సరం కళాశాలలో చేరిన నూతన విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ విజయ్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, ఇందిరా కుమారి, ఎం.ఉషారాణి, ధారావతు మల్లేష్, బి.రాజు పాల్గొన్నారు.

జగన్మాతా నమోస్తుతే..

బుట్టాయగూడెం: దసరా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా అమ్మవార్లు విభిన్న రూపాల్లో సాక్షాత్కరించారు. మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే బుట్టాయగూడెం త్రిశక్తి పీఠంలో మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కలశ గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక త్రిశక్తి పీఠం నుంచి అభయాంజనేయ స్వామి గుడి వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. రెడ్డిగణపవరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమ వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

మహాలక్ష్మి అవతారంలో అమ్మవార్లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో దసరా మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు అమ్మవార్లు మహాలక్ష్మి అవతారంలో భక్తులతో పూజలందుకున్నారు. జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ, నూకాలమ్మ, వాసవీ మాత, ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. గంగానమ్మ అమ్మవారిని సుమారు రూ.3 కోట్లతో అలంకరించగా, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని రూ.1.40 కోట్లతో అలంకరించారు. గంగానమ్మ అమ్మవారి ఆలయంలో కోసూరి రాజేష్, కోసూరి సాగర్, దేవులపల్లి సత్యనారాయణ దంపతులు, వసుంధర ఆసుపత్రి యాజమాన్యం ఉభయధారులుగా వ్యవహరించగా, ప్రసాద వితరణ యువరాజ్ కల్కి ట్రేడర్స్, నాగ వెంకటసాయి రాఘవేంద్ర ఏజెన్సీస్, అలంకరణ చీర టీవీఎ నవీన్ దంపతులు సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కలగర వీర్రాజు పర్యవేక్షించారు. నూకాలమ్మ ఆలయంలో వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాద వితరణకు జి.వంశీకుమార్ రాజు, సీహెచ్‌ఆర్, చింత నాగరాజు, విద్యా వికాస్ విద్యాసంస్థల యాజమాన్యం సహకరించినట్లు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన పండు తెలిపారు. పీవీఎల్ సుబ్రహ్మణ్యరాజు కుటుంబ సభ్యులు అమ్మవారి వెండి చీర నిమిత్తం 10 తులాల వెండిని సమర్పించారని తెలిపారు. ముత్యాలమ్మ మహాలక్ష్మిదేవి అలంకరణలో ఎర్రకలువలతో పూజలందుకుంది. మాతు రాజా, లక్ష్మి శ్యామల అలంకరణ, డాక్టర్ చెరుకూరి నరేన్, డాక్టర్ రోషినిలు ప్రసాద వితరణ దాతలుగా వ్యవహరించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.1.40 కోట్లతో మహాలక్ష్మిగా అలంకరించారు. డి.బాపిరాజు, బి.వెంకటేశ్వరరావు, జి.నారాయణరావు దంపతులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి లక్ష పుష్పార్చన, మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఇమ్మడి రమేష్, కర్పూరం కృష్ణారావు దంపతులు, చైర్మన్ కోడూరి సత్యనారాయణ రెడ్డి, శీరపు హేమంత్‌రెడ్డి, హిమ సింధూర, మెటోస్ కాలనీవాసులు పాల్గొన్నారు.



టి.నరసాపురం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బుట్టాయగూడెం: కలశాలతో ప్రదర్శన చేస్తున్న భక్తులు



జంగారెడ్డిగూడెం: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



కొయ్యలగూడెం: లక్ష్మీదేవిగా..



కొయ్యలగూడెం: చండీదేవిగా..



ద్వారకాతిరుమల: కాత్యాయనీదేవిగా..



జంగారెడ్డిగూడెం: మహాలక్ష్మిగా..

కుంకుమ, సరస్వతి పూజ

జంగారెడ్డిగూడెం పట్టణంలో హైస్కూల్ పక్కన సర్వమంగళాసహిత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మహిళలకు కుంకుమ పూజలు, విద్యార్థినీ విద్యార్థులకు సరస్వతి పూజలు నిర్వహించారు. సుమారు 150 మంది మహిళలు ఈ కుంకుమపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు కొప్పాక కేశవరావు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, కాకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చండీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా కనకదుర్గమ్మ చండీదేవి, మహాలక్ష్మి, అన్నపూర్ణాదేవి అలంకరణలతో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. టెంపుల్స్ సెంటర్‌లోని శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మను చండీ దేవిగా, వాసవీమాతను అన్నపూర్ణాదేవిగా, కాళింగుల పేట, వై జంక్షన్, కన్నాపురంలోని విజయలక్ష్మి కనకదుర్గమ్మ, దుర్గాభవాని రసలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీ కాత్యాయనీ దేవిగా.. వాసవీమాత

ద్వారకాతిరుమల: క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఉన్న ఆలయంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం శ్రీ కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి పురోహితులు విశేష కుంకుమ పూజలు నిర్వహించి, హారతులిచ్చారు. అలాగే అమ్మవారిని దర్శించిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శ్రీ మహాలక్ష్మిగా.. కుంకుళ్లమ్మ

క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు శుక్రవారం శ్రీమహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్ల నడుమ, చిరుమందహాసంతో అమ్మవారు అభయహస్తాన్ని ప్రదర్శిస్తూ భక్తులను కటాక్షించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు

టి.నరసాపురం: దసరా ఉత్సవాలు ఐదో రోజు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. టి.నరసాపురం కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం, గీతా మందిరం, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద అమ్మవార్లను లక్ష్మీదేవిగా అలంకరించి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. బండివారిగూడెం, అప్పలరాజుగూడెం, మక్కినవారిగూడెం, తిరుమలదేవిపేట, బొర్రంపాలెం తదితర గ్రామాల్లో నెలకొల్పిన అమ్మవారి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.